సాక్షి
అనంతపురం

శుక్రవారం । 16 । ఫిబ్రవరి । 2024



టన్ను చీనీ రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.15

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.15, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికాయి.

గరిష్టం/కనిష్టం

36.3°/ 16.7°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి వాతావరణం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

బాలింతల వివరాలు నమోదు చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: గర్భిణులు, బాలింతలకు అందించే ఆరోగ్య సేవలకు సంబంధించిన వివరాలను హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ (హెచ్‌ఎంఐఎస్)లో తప్పకుండా నమోదు చేయాలని డీఎంహెచ్‌ఓ ఈ భ్రమరాంబదేవి పేర్కొన్నారు. గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో హెచ్‌ఎంఐఎస్ నోడల్ అధికారులతో డీఎంహెచ్‌ఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓపీ సేవలు, ల్యాబొరేటరీ పరీక్షల వివరాలు, గర్భిణులు, బాలింతలకు అందించే వ్యాధి నిరోధక టీకాల సేవలు, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీ, ఇతర అన్ని ఆరోగ్య కార్యక్రమాల సేవలను సంబంధిత పోర్టల్‌లో పొందుపర్చాలన్నారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ వచ్చే నెల 3వ తేదీన మొదలయ్యే పల్స్ పోలియో టీకా చుక్కల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓ మహమ్మద్ రఫీ, డిప్యూటీ ఎస్‌ఓ గౌడ్, నాగేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి

పుట్టపర్తి టౌన్: గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ - సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత శిక్షణతో కూడిన ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఏఆర్‌టీపీ సిల్క్ కళాశాలలో రీటైల్ సేల్స్ సూపర్‌వైజర్, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు డీఆర్‌డీఏ-సీడాప్ సంచాలకులు నరసింహారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారై ఉండి 18 నుంచి 26 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్న వారు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. తప్పనిసరిగా ఇంటర్ ఉత్తీర్ణులై.. చదువు కొనసాగిస్తూ ఉండకూడదని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డ్, ఉపాధిహామీ కార్డుతో అనంతపురము పంగల్ రోడ్డు వద్ద ఉన్న టీటీడీసీ శిక్షణ కేంద్రంలో సంప్రదించాలన్నారు. ఈనెల 15 నుంచి 18 వరకూ ఎంపికలు జరుగుతాయన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 4 నెలల పాటు భోజన సదుపాయంతో కూడిన ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 86394 39804, 96408 99337, 80744 52233 నంబర్లకు సంప్రదించాలన్నారు.

ఖరీఫ్‌కు విత్తన, పంటల ప్రణాళిక



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఏఓ, ఇతర అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: మే నుంచి ప్రారంభం కానున్న 2024 ఖరీఫ్‌కు సంబంధించి అవసరమైన విత్తన ప్రతిపాదనలు, అలాగే పంటల ప్రణాళిక సిద్ధం చేసి పంపాలని వ్యవసాయశాఖ కమిషనర్ జి.శేఖర్‌బాబు ఆదేశించారు. గురువారం గుంటూరు నుంచి ఆయన జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్‌బీకే వేదికగా పంటల ప్రణాళిక, అలాగే విత్తన, ఎరువుల ప్రణాళికలు సిద్ధం చేసి నెలాఖరులోపు పంపించాలన్నారు. ఒకట్రెండు పంటలను ప్రోత్సహించకుండా నేల రకాలు, ప్రాంతాలను బట్టి వివిధ రకాల చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనె గింజల పంటలు సాగు చేసేలా రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. రబీ ఈ-క్రాప్ బుకింగ్, సూపర్ చెకింగ్, పీఎం కిసాన్ పెండింగ్ ఈ-కేవైసీ, పొలంబడి, మార్క్‌ఫెడ్‌కు చెల్లించాల్సిన బకాయిలు, క్వాలిటీ కంట్రోల్‌లో భాగంగా విత్తనాలు తదితర అంశాలపై సమీక్షించారు. ఎన్నికల కోడ్ వచ్చేలోపు లక్ష్య నిర్దేశన మేరకు వందశాతం సాధించాలన్నారు. డీఏవో ఉమామహేశ్వరమ్మ, ఏడీఏలు ఎం.రవి, యల్లప్ప, వెంకటరాముడు, లక్ష్మానాయక్, చెంగలరాయుడు, పద్మజ, టెక్నికల్ ఏఓలు వెంకటకుమార్, బాలానాయక్, రాకేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

డీటీల బదిలీకి రంగం సిద్ధం

అనంతపురం అర్బన్: ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న డిప్యూటీ తహసీల్దార్లను బదిలీకి రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఎన్నికల సంఘం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకే మండలంలో మూడేళ్ల సర్వీసు పూర్తయిన వారితో పాటు సొంత మండలంలో పని చేస్తున్న వారిని బదిలీ చేయనున్నారు. ఈసీ నుంచి స్పష్టత వచ్చిన వెంటనే బదిలీల ప్రక్రియకు కసరత్తు చేపడతామని చెబుతున్నారు.

పది పరీక్షలకు సన్నద్ధం

- అనంతపురం జిల్లాలో 31 వేల మంది
- శ్రీసత్యసాయిలో 22 వేల మంది విద్యార్థులు
- మార్చి 18 నుంచి పరీక్షలు ప్రారంభం.. 30న చివరి పరీక్ష
- పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులపై అధికారుల కసరత్తు



పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. మార్చి 18 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల నిర్వహణపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో కలిపి 53 వేల మందిపై చిలుకు రెగ్యులర్ విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. ఇప్పటికే విద్యార్థుల పరీక్షల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్ ఉండేలా పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

ఇంగ్లిష్ మీడియం విద్యార్థులే అధికం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంగ్లిష్ మీడియానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడమే కాకుండా 8వ తరగతి నుంచే ట్యాబ్‌లు ఇచ్చి వారికి సాఫ్ట్ స్కిల్స్ నేర్పిస్తోంది. 2024లో ఎస్‌ఎస్‌సీ పరీక్షలకు హాజరవుతున్న వారిలో ఎక్కువ మంది ఇంగ్లిష్ మీడియం విద్యార్థులే ఉన్నారు. అనంతపురం జిల్లాలో 31,330 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా అందులో 21,545 మంది ఇంగ్లిష్ మీడియంలోనే పరీక్షలు రాయనున్నారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలో 22,002 మంది ఎస్‌ఎస్‌సీ పరీక్షలు రాస్తుండగా 16,134 మంది విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో పరీక్షలు రాయనున్నారు.

అబ్బాయిలే ఎక్కువ...

పదో తరగతి పరీక్షలు రాస్తున్న వారిలో అబ్బాయిలే ఎక్కువగా ఉన్నారు. అనంతపురం జిల్లాలో 16,092 మంది అబ్బాయిలు కాగా 15,238 మంది అమ్మాయిలు ఉన్నారు. కేవలం 854 మంది పైచిలుకు మాత్రమే అబ్బాయిలు ఎక్కువ. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలో 11,484 మంది అబ్బాయిలు, 10,518 మంది అమ్మాయిలు పరీక్షలు రాస్తున్నారు. ఇదిలా ఉంటే ఎస్‌ఎస్‌సీ పరీక్షలు రాస్తున్న అమ్మాయిల సంఖ్య ప్రతి ఏడాదీ పెరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. రెండు జిల్లాల్లోనూ పరీక్షలు సజావుగా జరిగేందుకు అధికారులు అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నారు.

జిల్లాలో విద్యార్థుల సంఖ్య ఇలా...

పరీక్షలు రాస్తున్నది	31,330
బాలురు	16,092
బాలికలు	15,238
ఇంగ్లిష్ మీడియం	21545
తెలుగు మీడియం	9475
కన్నడ మీడియం	220
ఉర్దూ మీడియం	90
మొత్తం పరీక్షా కేంద్రాలు	142

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



మార్చి 18 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షల కోసం జిల్లాలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నాం. 142 కేంద్రాలు ఏర్పాటు చేశాం. జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక కేంద్రాలు లేవు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారుల నియామకాలు జరుగుతున్నాయి. పరీక్షలు సజావుగా జరిగేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– వరలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి

హెచ్‌ఎంలు, ఎంఈఓలే కీలకం

- పదో తరగతి పరీక్షల సమీక్షలో విద్యాశాఖ ఆర్జేడీ రాఘవరెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్జేడీ రాఘవరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: పాఠశాలల నిర్వహణలో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, మండల విద్యాశాఖ అధికారులే కీలకం అని పాఠశాల విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) వై.రాఘవరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షలపై ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, స్పెషల్ ఆఫీసర్లు, ఎంఈఓలతో ఆర్జేడీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలకు అవసరమైన అంశాలను నేర్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకొచ్చిందన్నారు. ఈ పాలసీని అమలు చేయడంలో మన రాష్ట్రం దేశంలోని ఇతర రాష్ట్రాలకంటే చాలా ముందు ఉందన్నారు. ప్రతి టీచర్‌కూ లెసన్ ప్లాన్ తప్పనిసరిగా ఉండాల్సిందేనన్నారు. ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించొద్దన్నారు. విద్యార్థులకు చదువు అందించే విషయంలో రాజీ పడేదిలేదన్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించిందన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు మించి మన పాఠశాలలు ఉన్నాయన్నారు. చదువు చెప్పాల్సిన బాధ్యత టీచర్లపై ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి అమలును పర్యవేక్షించాల్సిన బాధ్యత హెచ్‌ఎం, ఎంఈఓలు, ప్రిన్సిపాళ్లపై ఉందన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున ప్రతి విద్యార్థిపై వ్యక్తిగతంగా దృష్టి సారించి సన్నద్ధం అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఈఓ నాగరాజు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్, డీవైఈఓలు శ్రీనివాసరావు, శ్రీదేవి, డీసీఈబీ కార్యదర్శి పురుషోత్తంబాబు, ఏడీ కృష్ణయ్య, సూపరింటెండెంట్లు శ్రీనాథ్, సరళ, పాఠ్యపుస్తకాల ఇన్‌చార్జ్ పానిరేఖ, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కమిటీలో చోటు


అనంతపురం కార్పొరేషన్: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం చర్యలకు ఉపక్రమించింది. అందులో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ రాష్ట్ర న్యాయ విభాగ కమిటీ (లీగల్ సెల్)ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. న్యాయ విభాగ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా జిల్లాకు చెందిన ఎల్‌కే సురేంద్రనాథ్, కార్యదర్శిగా కురువ నాగిరెడ్డి, సహాయ కార్యదర్శిగా దొరన్నగారి నాగరాజు నియమితులయ్యారు. రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులకు చోటు కల్పించడంపై సీఎం వైఎస్ జగన్, లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు యం మనోహర్ రెడ్డికి వైఎస్సార్ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి కృతజ్ఞతలు తెలిపారు.

ఇకపై ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శి

అనంతపురం రూరల్: మూడు నాలుగు పంచాయతీల విధులను ఒకే పంచాయతీ కార్యదర్శి నిర్వహిస్తుండటంతో పంచాయతీల పరిపాలనలో ఆటంకాలు ఎదురయ్యేవి. అయితే ఆ సమస్యలకు ప్రభుత్వం చెక్ పెట్టింది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధి, ప్రజలకు సుపరిపాలన అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి పంచాయతీకి ఒక పంచాయతీ కార్యదర్శిని నియమించుకునే అవకాశం కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులమేరకు ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శిని నియమించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

'సిద్ధం' సభకు ముమ్మర ఏర్పాట్లు

- 110 ఎకరాల్లో సభ కోసం ఏర్పాట్లు
- 50 నియోజకవర్గాల నుంచి తరలిరానున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- 25 చోట్ల పార్కింగ్‌కు చర్యలు



ముస్తాబైన సిద్ధం సభా ప్రాంగణం



సిద్ధమైన హెలిప్యాడ్

రాప్తాడు: ఎన్నికల శంఖారావంలో భాగంగా రాప్తాడులో ఈనెల 18న నిర్వహించనున్న సిద్ధం సభకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ వేదిక నుంచే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నారు. గురువారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆయన సోదరులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి సభావేదిక ఏర్పాట్లను పరిశీలించారు.

50 నియోజకవర్గాల నుంచి...

జిల్లా చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. రాయలసీమ జిల్లాలైన అనంతపురం, కర్నూలు, వైఎస్సార్, చిత్తూరు జిల్లాల్లోని 50 నియోజకవర్గాల నుంచి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో పాటు లక్షల సంఖ్యలో పార్టీ శ్రేణులు సిద్ధం సభకు హాజరు కానున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు 25కి పైగా పార్కింగ్ ప్రాంతాలు గుర్తించారు. కార్యకర్తలకు దగ్గరగా వెళ్లి సీఎం జగన్ అభివాదం చేయడానికి వీలుగా సుమారుగా కిలో మీటరు విస్తీర్ణంతో ప్రత్యేక స్టేజీలను ఏర్పాటు చేస్తున్నారు.

ముమ్మరంగా సాగుతున్న పనులు

సభ జరిగే 110 ఎకరాల విస్తీర్ణాన్ని పూర్తిగా చదును చేసి సభా ప్రాంతాన్ని ముస్తాబు చేశారు. సభా ప్రాంగణం వేనుక భాగంలో సీఎం హెలీ ప్యాడ్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. హెలీ ప్యాడ్ దగ్గర నుంచి సభ ప్రాంగణం దగ్గరకు తారా రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. సభ ప్రాంగణాన్ని మ్యాట్‌తో కప్పి ముస్తాబు చేశారు. అలాగే రైల్వే బ్రిడ్జి దగ్గర బ్రిడ్జి పనులు జరుగుతుండడంతో బ్రిడ్జి కింద మట్టి రోడ్డుపై తారుతో డబుల్ రోడ్డు వేశారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం రూరల్, అర్బన్ డీఎస్పీలు వెంకటశివారెడ్డి, ప్రసాద్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు.

సీఎం పర్యటన ఖరారు

అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 18న జిల్లాకు విచ్చేస్తున్నారు. రాప్తాడులో జరగనున్న సిద్ధం సభలో ఆయన పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించి షెడ్యూల్‌ను సీఎం అదనపు పీఎస్ నాగేశ్వరరెడ్డి విడుదల చేశారు.

సీఎం పర్యటన ఇలా...

- 18వ తేదీ మధ్యాహ్నం 2.45 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు.
- మధ్యాహ్నం 2.55 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో రాప్తాడుకు బయలుదేరుతారు.
- మధ్యాహ్నం 3.15 గంటలకు రాప్తాడు చేరుకుంటారు.
- మధ్యాహ్నం 3.20 గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి 3.25 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకుంటారు.
- మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ బహిరంగ సభలో పాల్గొంటారు.
- సాయంత్రం 5.05 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- సాయంత్రం 5.10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 5.35 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు.
- సాయంత్రం 5.45 గంటలకు ప్రత్యేక విమానంలో అక్కడి నుంచి బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి వెళతారు.

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు



మాట్లాడుతున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

రాప్తాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 18న జిల్లా పర్యటనకు వస్తున్నారని, పర్యటనకు పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం రాప్తాడులో అనంతపురం రూరల్ డీఎస్పీ కార్యాలయంలో సీఎం జిల్లా పర్యటనపై జిల్లాలోని అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ సిద్ధం సభకు వచ్చే వారికి ఏ ఇబ్బంది లేకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఎవరికి కేటాయించిన విధులను వారు సక్రమంగా చేపట్టి, సభకు వచ్చే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. కేటాయించిన స్థలంలోనే పార్కింగ్ చేసేలా చూడాలన్నారు. సభ ప్రాంగణం వద్దకు అనుమతి ఉన్న వాహనాలను మాత్రమే అనుమతించాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, లక్ష్మీనారాయణరెడ్డి, డీఎస్పీలు వెంకటశివారెడ్డి, ఆంథోనప్ప, శ్రీనివాసులు, గంగయ్య, భాస్కర్‌రెడ్డి, హేమంత్ కుమార్, సీఐలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

సేవాగఢ్‌లో ఘనంగా ప్రాకారోత్సవం



ఇరుముడులు సమర్పించేందుకు వస్తున్న సేవాలాల్ మాలధారులు



మహాభోగ్ నిర్వహిస్తున్న దృశ్యం

- ముగిసిన సేవాలాల్ జయంత్యుత్సవాలు

గుత్తి రూరల్: మండలంలోని చెర్లోపల్లి పంచాయతీ సేవాగఢ్‌లోని సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంత్యుత్సవాలు గురువారం ప్రాకారోత్సవంతో ఘనంగా ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకుడు మారుతీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహరాజ్‌కు కుంభాభిషేకం జరిపించారు. సేవాలాల్ ఉత్సవ విగ్రహాన్ని తోలారం గుర్రంపై ఊరేగించారు. సేవాలాల్ మాలధారులు భక్తిశ్రద్ధలతో ఇరుముడులు సమర్పించారు. ఆలయం ఎదుట ఉన్న హోమం కట్టపై మహాభోగ్ (హోమం) నిర్వహించారు. 108 మంది కన్యలు పూర్ణగంగ కలశోత్సవం నిర్వహించారు. 108 మంది కన్యలు మావలి జగదాంబ ఆలయం వరకూ కలశాలతో ఊరేగింపుగా వచ్చి కుంభాభిషేకం జరిపించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు సేవాలాల్ మహరాజ్‌కు పట్టువస్త్రాలు సమర్పించారు. ఉత్సవాలు విజయవంతం కావడంతో ట్రస్టు సభ్యులు నృత్యాలు చేసి తల్వార్‌తో విన్యాసాలు చేశారు. జయంతి ఉత్సవాల సందర్భంగా బంజారాలతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. సంప్రదాయ దుస్తులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవాలాల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు జగన్నాథరావు, ఉపాధ్యక్షుడు కేశవనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్రనాయక్, కార్యదర్శి అశ్వత్థనాయక్, సభ్యులు బాలనాయక్, సుబ్రమణ్యం నాయక్, రామచంద్రనాయక్, పాల్గొన్నారు.

ప్రభుత్వ ఏర్పాట్లు

ఉత్సవాలకు వచ్చిన బంజారాలకు ప్రభుత్వ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజ్‌కుమార్, ఏఈ మంజునాథ్ ఆధ్వర్యంలో తాగునీటి సదుపాయం, బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యుడు ప్రవీణ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం, విద్యుత్ శాఖ ఏఈ కుమార్ సిబ్బందితో విద్యుత్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. సమాచార శాఖ ఆధ్వర్యంలో గిరిజన ఆచారాలు, సంస్కృతిపై ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉత్సవాలకు గుత్తి, గుంతకల్లు డిపోల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపారు. సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ నబిరసూల్ సిబ్బందితో బందోబస్తును నిర్వహించారు.

సేవాలాల్ మహరాజ్ అందరికీ ఆదర్శం



సంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: సమాజాభివృద్ధికి పాటుపడిన సంత్ సేవాలాల్ మహరాజ్ అందరికీ ఆదర్శమని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సేవాలాల్ మహరాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై సేవలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బంజారాల హక్కుల కోసం నీరు, భూమి, అడవి అనే నినాదంతో సంత్ సేవాలాల్ మహరాజ్ పోరాడారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు ఉద్యోగుల ప్రత్యేక స్పందన

అనంతపురం అర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సాయంత్రం 4 గంటలకు స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

అరటి తోట దగ్ధం



మంటల్లో కాలిపోయిన అరటి చెట్లు

బుక్కరాయసముద్రం: మండలంలోని కొండాపురంలో అరటి తోట దగ్ధమైంది. రైతు రామకృష్ణ 3 ఎకరాల్లో 3,500 అరటి చెట్లను సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి తోట పూర్తిగా దగ్ధమైంది. డ్రిప్పు పరికరాలు, పీవీసీ పైపులు, అరటి చెట్లు కాలి బూడిదయ్యాయి. దాదాపు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు రైతు రామకృష్ణ వాపోయాడు.

రేపు రాష్ట్రస్థాయి సైన్స్ కళాజాతా

అనంతపురం ఎడ్యుకేషన్: జన విజ్ఞాన వేదిక రాష్ట్ర స్థాయి సైన్స్ కళాజాత ఈ నెల 17న అనంతపురానికి రానుంది. ఈ మేరకు జేవీవీ నగర అధ్యక్షుడు రామిరెడ్డి, మ్యాజిక్ షో జిల్లా కన్వీనర్ ప్రసాద్ గురువారం తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శంకరయ్య చేతుల మీదుగా విడుదల చేశారు. ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించడంలో భాగంగా రాష్ట్రస్థాయి సైన్స్ కళాజాతను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు కళా ప్రదర్శన ఉంటుందన్నారు. ముఖ్యఅతిథులుగా ఎస్కేయూ రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ అభిషేక్‌రెడ్డి, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం. గేయానంద్, రాష్ట్రస్థాయి కళాజాత కన్వీనర్ త్రిమూర్తులు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, ఐక్యూస్ కో–ఆర్డినేటర్ పర్వీన్, కామర్స్ అధ్యాపకులు ఆదినారాయణ, ఎం.ధనలక్ష్మి, జేవీవీ నగర నాయకులు సాకే లక్ష్మీనారాయణ, నూర్ మహమ్మద్ పాల్గొన్నారు.

వలంటీర్లు... నిస్వార్థ సేవకులు

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ
- ఉత్తమ వలంటీర్లకు పురస్కారాల ప్రదానం



పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, నదీమ్, లిఖిత, మంజుల, ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్, కమిషనర్ మేఘ స్వరూప్ తదితరులు

అనంతపురం సిటీ: నిస్వార్థ సేవకు ప్రతిరూపాలు మీరేనని వలంటీర్లను జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అభినందించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరువ చేయడంలో అహర్నిశం శ్రమించిన వలంటీర్లకు ఉత్తమ సేవా పురస్కారాల ప్రదానోత్సవం గురువారం అనంతపురంలోని రెవెన్యూభవన్‌లో జరిగింది. ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్, డీసీసీడీ చైర్‌పర్సన్ లిఖిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, ఏపీ అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ టి.లక్ష్మి, వ్యవసాయ సలహా మండలి జిల్లా కమిటీ సభ్యుడు ఆలమూరు సుబ్బారెడ్డి పాల్గొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని అందరికీ వినిపించారు. అనంతరం గిరిజమ్మ మాట్లాడుతూ.. వరుసగా నాల్గో ఏడాది వలంటీర్లకు అవార్డులు అందజేయడం గర్వంగా ఉందన్నారు. నవరత్నాలు, సంక్షేమ పథకాల ఫలాలను పేద, మధ్య తరగతి ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్లు అందించిన సేవలను కొనియాడారు. కరోనాలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి సేవలందించిన విషయాన్ని ఎవరూ మరచిపోలేరన్నారు. వలంటీర్ల సేవకు గుర్తింపుగా సేవావజ్రకు ఇచ్చే రూ.30 వేలను రూ.45 వేలకు, సేవారత్నకు రూ.20 వేల నుంచి రూ.30 వేలకు, సేవామిత్ర పురస్కారాలను రూ.10 వేల నుంచి రూ.15 వేలకు అంటే 50 శాతం పెంచి ఇవ్వడంతో జగనన్న మరో రికార్డు సృష్టించారన్నారు. వలంటీర్లు మరింత సమర్థవంతంగా సేవలందించి, ప్రతి ఒక్కరూ పురస్కారాలకు ఎంపిక కావాల్సి ఉందని ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా 39 మందికి సేవా వజ్ర అవార్డులకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే సేవారత్న అవార్డుకు 198 మంది, సేవామిత్ర అవార్డుకు మొత్తం 10,943 మంది ఎంపికైనట్లు వివరించారు. అలాగే టెస్టిమోనియల్స్ కింద వైఎస్సార్ పింఛన్ కానుక, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాల కింద లబ్ధిదారుల మనోభావాలను అత్యుత్తమంగా సేకరించి 46 మంది వలంటీర్లకు వేర్వేరుగా నగదు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందులో జిల్లా స్థాయిలో ఎంపికైన ఒకరికి రూ.25 వేలు, నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన ఎనిమిది మందికి రూ.20 వేలు చొప్పున రూ.1.60 లక్షలు అందజేశారు. మండల, మున్సిపాలిటీ స్థాయిలో ఎంపికైన 37 మంది వలంటీర్లకు రూ.15 వేలు చొప్పున రూ.5.55 లక్షలు అందించారు.

గుర్తింపు దక్కింది



ప్రజలకు సేవ చేసే భాగ్యం సీఎం జగనన్న వల్ల మాకు కలిగింది. ఇచ్చేది గౌరవ వేతనమే అయినా.. సమాజంలో గౌరవప్రదమైన హోదా దక్కింది. ఇప్పుడు సేవావజ్ర అవార్డు వచ్చిందంటే నా సేవలకు తగిన గుర్తింపు దక్కిందని భావిస్తున్నా.

– రాజేశ్వరి, సేవావజ్ర అవార్డుగ్రహీత, రుద్రంపేట–2 సచివాలయం

ఆత్మవిశ్వాసం పెరిగింది



ఒక్కో వలంటీరుకు 50 కుటుంబాల బాధ్యతలు అప్పగించారు. అంటే ఆయా కుటుంబాలకు ప్రభుత్వ పథకాలన్నీ మా చేతుల మీదుగానే అందుతున్నాయి. ఎంతో అదృష్టం చేసుకుంటే గానీ ఇంతటి గొప్ప అవకాశం రాదు. మా శ్రమ వృథా కాలేదు. సమాజంలో మాకో గుర్తింపు, గౌరవం దక్కిందంటే జగనన్న పుణ్యమే. ఆయన మేలును ఎన్నటికీ మరువం.

– షేక్ షహీనా, సేవారత్న అవార్డు గ్రహీత, నారాయణరెడ్డి కాలనీ, అనంతపురం

అట్టహాసంగా టిడ్కో గృహాల ప్రారంభం

- తొలి విడతలో 384 మందికి అందజేత
- మార్చి నెలాఖరుకు లబ్ధిదారులందరికీ గృహాల అప్పగింత
- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్



లబ్ధిదారులకు తాళం చెవి అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

తాడిపత్రి టౌన్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని గన్నెవారిపల్లికాలనీలో టిడ్కో గృహాల ప్రారంభోత్సవం గురువారం అట్టహాసంగా జరిగింది. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, టిడ్కో చైర్మన్ జమాన ప్రసన్నకుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై దాదాపు రూ.77.32కోట్ల వ్యయంతో నిర్మించిన 1,024 గృహాలలో తొలి విడత కింద 384 గృహాలను లబ్ధిదారులకు అందజేశారు. అలాగే జగనన్న మహిళా మార్టుకు శంకు స్థాపన చేశారు. అంతకు ముందు దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొందరు లబ్ధిదారుల నూతన గృహాలను సందర్శించి ఇంటి యజమానులకు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ... పేదలకు సామాజిక గౌరవం కల్పించేందుకు అక్కాచెల్లెమ్మలకు కేవలం ఒక్క రూపాయికే రూ.15 లక్షలు విలువ చేసే ఇంటిని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందజేస్తున్నారన్నారు. తొలి విడుతలో 384 మందికి గృహాలు అప్పగించామని, మార్చి నెలాఖరుకు మిగిలిన లబ్ధిదారులందరికీ గృహాలను స్వాధీనం చేస్తామని పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలో టిడ్కో లబ్ధిదారులపై మోపిన ఆర్థిక భారాన్ని కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తొలగించిందని గుర్తు చేశారు. కేవలం ఒక్క రూపాయికే 300 చదరపు అడుగుల ఇంటిని అందజేయడం ద్వారా లబ్ధిదారులకు దాదాపు రూ.10కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరిందని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవి, ఎస్ఈ రాజశేఖర్, ఈఈ మల్లికార్జునప్ప, డీఈ సాలన్న, చింతల వేంకటరమణస్వామి ఆలయ పాలక మండలి చైర్మన్ కందిగోపుల మురళీప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రాజు, జెడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ పాల్గొన్నారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్ట్

సింగనమల: మండలంలోని నిదనవాడ సమీపంలో గురువారం కోడి పందెం ఆడుతున్న ఏడుగురుని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. నిందితుల నుంచి రూ.70,470 నగదు, ఇన్నోవా కారు, కోడి పుంజు, ఏడు మొబైల్ ఫోన్లు, మూడు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

సంక్షేమ పాలన వైఎస్ జగన్‌తోనే సాధ్యం





ప్రసంగిస్తున్న వైఎస్ విమలారెడ్డి (చిత్రంలో) ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, హాజరైన పాస్టర్లు

- అంతర్జాతీయ సువార్త ప్రసంగీకురాలు వైఎస్ విమలారెడ్డి

అనంతపురం కల్చరల్: దేశంలో మరెక్కడా లేనన్ని సంక్షేమ పథకాలు కేవలం ఏపీలోనే అమలవుతున్నాయని, ఆ సంక్షేమ ఫలాలు మరోసారి పేదలకు దక్కాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంతర్జాతీయ సువార్త ప్రసంగీకురాలు, దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరి వైఎస్ విమలారెడ్డి అన్నారు. జిల్లా పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో అనంతపురంలోని గుత్తి రోడ్డులో ఉన్న ఓ ఫంక్షన్ హాల్ వేదికగా గురువారం పాస్టర్ల సదస్సు నిర్వహించారు. పాస్టర్ల సంఘం అధ్యక్షుడు నెహెమ్యానాగరాజు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి వైఎస్ విమలారెడ్డితో పాటు అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు (క్రిస్టియన్ అడ్వైజర్) బాలాస్వామి, ఏపీ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, సీఎస్ఐ చర్చి పాస్టర్ రెవరెండ్ బెన్‌హర్‌బాబు, తదితరులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. క్రైస్తవులందరూ మళ్లీ ఐక్యమత్యంతో సుభిక్షమైన పాలనను తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపక్షాల కుట్రలను, కుతంత్రాలను తరిమికొట్టేలా సామాన్యులను చైతన్యవంతం చేసే శక్తి పాస్టర్లకే ఉందన్నారు. సంక్షేమం అంది ఉంటేనే ఓటు వేయండి, ప్రతి ఇంటికీ మంచి జరిగితేనే ఆశీర్వదించండని ఇంత ధైర్యంగా చెప్పే ముఖ్యమంత్రి దేశంలోనే లేరన్నారు. గత టీడీపీ పాలనలో క్రైస్తవులు పడిన పాట్లను గుర్తు చేశారు. కేవలం జగన్ పాలనలో మాత్రమే పాస్టర్లకు గౌరవవేతనం అందుతోందన్నారు. క్రైస్తవులకు సమస్యలేమున్నా చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకొస్తుందన్నారు. దివంగత వైఎస్సార్ హయాంలో ప్రారంభమైన క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆయన తర్వాత నిస్సారంగా మారిందని మళ్లీ జగన్ మాత్రమే క్రైస్తవులను గుర్తిస్తున్నారన్నారు. పాస్టర్లు సుధాకరబాబు, మనుష్యే, ఏషయ, విజయ్, జాన్, ఆనంద్, ప్రభాకరరెడ్డి, ఫిలప్, కన్వీనర్ ఎన్ఆర్ బాబు, మోజెస్, సునీల్, సిస్టర్ విజయకుమారి ప్రసంగించారు. అంతకు ముందు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని సామూహిక ప్రార్థనలు జరిగాయి.

డిమాండ్ల సాధనకు ఒక్కరోజు సమ్మె

గుంతకల్లు: డిమాండ్ల సాధనకు ఒక్కరోజు సమ్మెబాట పట్టినట్లు ఆయిల్ ట్యాంకర్స్ డ్రైవర్స్, క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు షేక్షావలి, షాషావలి, రామాంజినేయులు, హనుమేష్, నాగరాజు తెలిపారు. ఈ మేరకు ఐఓసీఎల్ డిపో మేనేజర్ నవీన్‌కుమార్‌కు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాలు, జాతీయ రవాణా కార్మిక సంఘాలు పిలుపు మేరకు సమ్మెలో వెళుతున్నట్లు ప్రకటించారు. భారతీయ న్యాయ సంహిత (2023) సెక్షన్ 106(01)(02)ను వెంటనే రద్దు చేయడంతో పాటు కఠినమైన శిక్షలు, జరిమానాలు విధించే ఎంవీ యాక్ట్ సవరణ చట్టం రద్దు, డ్రైవర్లకు కనీస వేతనం కింద రూ.34వేలు, క్లీనర్లకు రూ.26వేలు చెల్లించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించడం తదితర డిమాండ్ల సాధనకు సమ్మె బాట పట్టినట్లు వివరించారు. దీంతో గుంతకల్లు మండలం నక్కనదొడ్డి గ్రామ సమీపంలో ఉన్న ఐఓసీ, గుత్తిలోని బీపీసీఎల్‌తోపాటు వైఎస్సార్ జిల్లా కడప, చిత్తూరులోని ఇంధన డిపోల్లో నుంచి పెట్రోల్, డీజల్ సరఫరా చేసే ట్యాంకర్ డ్రైవర్లు, క్లీనర్లు గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం అర్ధరాత్రి వరకూ సమ్మెలోకి వెళుతున్నట్లు తెలిపారు. దీంతో 24 గంటల పాటు ట్యాంకర్ల రాకపోకలు నిలిచిపోతాయన్నారు.



ఐఓసీ డిపో వద్ద నిలిపిన ట్యాంకర్లు

జీజీహెచ్‌లో బయాప్సీ పరీక్ష విజయవంతం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి (జీజీహెచ్)లోని అడ్మిషన్‌లో ఉన్న క్యాన్సర్ బాధితునికి రేడియాలజీ విభాగం వైద్యులు నిర్వహించిన బయాప్సీ పరీక్ష విజయవంతమైందని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నగరానికి చెందిన 60 ఏళ్ల వృద్ధుడు క్యాన్సర్‌తో బాధపడుతూ ఇటీవల జీజీహెచ్‌లో చేరాడన్నారు. క్యాన్సర్ చికిత్సలో కణితి నిర్ధారణ పరీక్ష ఎంతో కీలకమన్నారు. ఈ పరీక్షలో భాగంగా గురువారం సీటీ గైడెడ్ లంగ్ బయాప్సీ నిర్వహించి, కుడి ఊపిరితిత్తుల్లో క్యాన్సర్ కణితిని గుర్తించినట్లు వివరించారు. ఆ తర్వాత బయాప్సీ పరీక్ష నిర్వహించడంతో పూర్తి స్థాయి ఫలితాలు వచ్చాయన్నారు. ప్రైవేట్‌లో రూ.15వేలు ఖర్చుతో నిర్వహించే ఈ తరహా పరీక్షను సర్వజనాస్పత్రిలో ఉచితంగా చేసినట్లు వివరించారు. రూ.వేల నుంచి రూ.లక్షల ఖర్చుతో కూడుకున్న శస్త్రచికిత్సలను జీజీహెచ్, సూపర్ స్పెషాలిటీలో ఉచితంగా చేస్తున్నారని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాని పిలుపునిచ్చారు. బయాప్సీ పరీక్షను విజయవంతంగా నిర్వహించిన రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ సురేష్ బృందాన్ని అభినందించారు.



మాట్లాడుతున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు (చిత్రంలో) డాక్టర్ వెంకటేశ్వరరావు

నేడు రథసప్తమి

ఉరవకొండ/అనంతపురం కల్చరల్: 'నమస్కార ప్రియోభానుః' అని ఆర్యోక్తి. కేవలం వందనంతోనే ప్రసన్నుడై సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించే సూర్య భగవానుడు జన్మించిన మాఘ శుద్ధ సప్తమిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ క్రమంలో అనంతకే తలమానికంగా నిలిచిన జిల్లాలోని ఉరవకొండ మండలం బూదగవి సూర్య దేవాలయం సర్వాంగా సుందరంగా ముస్తాబైంది. అతి ప్రాచీనమైన ఈ సూర్యదేవాలయం 13వ శతాబ్దానికి చెందిన చాళుక్య రాజులు నిర్మించినట్లు ఇక్కడి శాసనాల ద్వారా తెలుస్తోంది. గర్భగుడిలో దక్షిణాభిముఖంగా సూర్యభగవానుడి మూలవిరాట్ ఉండడం ఇక్కడి ప్రత్యేకత. ఆలయం ఎటూ చూసిన కేవలం మూడు రాళ్లతో నిర్మించినట్లుగా ఉంటుంది. ఆలయంలో తూర్పు ముఖంగా అరుదైన శివలింగం ఉంది. ఏటా రథసప్తమి పర్వదినాన ప్రభాత సూర్యకిరణాలు నేరుగా మూలవిరాట్‌ను తాకడం ఇక్కడి విశేషం. రథసప్తమిని పురస్కరించుకుని బూదగవిలో శుక్రవారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. బూదగవి తరహాలోనే తాడిపత్రిలోని చింతల వేంకటరమణస్వామి ఆలయంలో నేరుగా సూర్యకిరణాలు స్వామివారిని తాకడం విశేషం. అనంతపురంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం, పాతూరులోని విరూపాక్షేశ్వరాలయం, మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం, శివకోటి, శివబాలయోగి ఆశ్రమం తదితర ఆలయాల్లో రథసప్తమి వేడుకలను విశేషంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో తెల్లవారుజామునే సూర్యప్రభ వాహనంపై శ్రీవారి నగరోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. అలాగే అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల వేదికగా శుక్రవారం ఉదయం 6 గంటలకు సామూహిక సూర్యనమస్కారాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, వివేకానంద యోగకేంద్రం రాజశేఖరెడ్డి తెలిపారు.

దొంగకు 6 నెలల జైలు శిక్ష

తాడిపత్రి: పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడి కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ తాడిపత్రి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ గురువారం తీర్పు వెలువరించారు. వివరాలు.. నార్పలకు చెందిన బోసే సుభాష్... యల్లనూరు, తాడిపత్రి రూరల్, పుట్లూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడ్డాడు. ఆయా చోరీ కేసులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు పక్కా ఆధారాలతో సుభాష్‌ను అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో ముద్దాయి సుభాష్‌కి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తాడిపత్రి జేఎఫ్‌సీఎం చంద్రశేఖరరెడ్డి తీర్పు వెలురించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున సురేఖ వాదనలు వినిపించారు.

'ప్రత్యేక' పిల్లల సేవల్లో అలసత్వం వద్దు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రత్యేక పిల్లలకు అందించే సేవల్లో అలసత్వం వీడాలని సంబంధిత అధికారులకు ఇన్‌చార్జ్ డీఈఓ నాగరాజు సూచించారు. 'విజన్ 2025 ఇన్‌క్లూజివ్ ఆంధ్ర'లో భాగంగా సమగ్ర శిక్ష సమ్మిళిత విద్య విభాగం ఆధ్వర్యంలో గురువారం ఆర్టీటీ అంధుల పాఠశాలలో జిల్లాస్థాయి శిక్షణ ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రీసోర్స్‌పర్సన్లు, స్కూల్ అసిస్టెంట్లు (ప్రత్యేక విద్య) హాజరయ్యారు. ప్రత్యేక అవసరాల విద్యార్థులకు సంబంధించి సాంకేతిక పరమైన పలు అంశాలపై, యాప్స్ వినియోగంపై సమగ్ర శిక్ష ఎస్పీడీ కార్యాలయం నుంచి వచ్చిన అసిస్టెంట్ ఐఈ కోఆర్డినేటర్ మల్లికార్జున, రీసోర్స్ పర్సన్లు సునీల్, మహలక్ష్మీ నాయుడు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఐఈ కోఆర్డినేటర్ షమ, సీనియర్ అసిస్టెంట్ పెద్దయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని ప్రభుత్వం నిర్వహించడం హర్షణీయం

- ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్



మాట్లాడుతున్న వడిత్యా శంకర్‌నాయక్

అనంతపురం టవర్‌క్లాక్: సంత్ సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ అన్నారు. గురువారం అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా ఫిబ్రవరి 15న సేవాలాల్ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. ఈ వేడుకలను అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం జీఓ విడుదల చేయడంపై గిరిజనులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారన్నారు. గురువారం నిర్వహించిన వేడుకలకు తాను ప్రభుత్వం తరఫున హాజరు కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సేవాలాల్ మహరాజ్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు సంబంధించి అయిన ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామాంజినేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు నాయక్, రాయలసీమ యువజన అధ్యక్షుడు భాస్కర్ నాయక్, సుమతి భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

ఐఓటీతో విప్లవాత్మక మార్పులు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ శ్రీనివాసరావు

అనంతపురం: ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్(ఐఓటీ)తో విప్లవాత్మకమైన మార్పులు రానున్నాయని జేఎన్‌టీయూ (ఏ) వీసీ డాక్టర్ జీవీఎస్ శ్రీనివాసరావు అన్నారు. జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ కళాశాలలోని ఈసీఈ విభాగం, ఐఓటీ హ్యాక్‌థాన్ మేక్ స్కిల్ట్ ఇన్నోవేషన్ – హైదరాబాద్ సంయుక్తంగా మూడు రోజుల పాటు జరిగే సదస్సు గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్లుగా ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ జి.మమత, డాక్టర్ డి.విష్ణువర్ధన్ వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా వీసీ హాజరై మాట్లాడారు. నిత్య జీవితంలో ఎక్కడో చోట ఐఓటీ అప్లికేషన్స్ వినియోగిస్తున్నట్లు గుర్తు చేశారు. అగ్రికల్చర్, మెడికల్ రంగాల్లో మొదలైన ఐఓటీ నేడు అన్ని రంగాల్లో ఎంతో ప్రాచుర్యం పొందిందన్నారు. ఈ తరహా కార్యక్రమాలు ఇంజినీరింగ్ విద్యార్థుల అభ్యున్నతికి దోహదపడతాయన్నారు. ఉద్యోగం చేయడం కంటే పదిమందికి ఉపాధి కల్పించే ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఐఓటీ, సెన్సార్, డెవలప్‌మెంట్ బోర్డు, ప్రోగ్రామింగ్‌పై మేక్‌స్కిల్ట్ ఇన్నోవేషన్ నిపుణులు అవగాహన కల్పించి మూడో రోజు విద్యార్థులతో ప్రాజెక్టులు రూపొందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ.. నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యతనివ్వాలని విద్యార్థులకు సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రమణారెడ్డి, డాక్టర్ లలితాకుమారి, డాక్టర్ అరుణామస్తానీ, విశ్రాంత ప్రొఫెసర్ ఎం.ఎస్.గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా ఆకాశవాణి



మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం సిటీ: వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు అన్నదాతలకు వినిపించి, అండగా నిలుస్తున్న ఆకాశవాణి(రేడియో) సేవలు అద్భుతమని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ కొనియాడారు. అనంతపురం రెవెన్యూ భవన్‌లో గురువారం నిర్వహించిన రేడియో రైతు దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆకాశవాణి కేంద్రం ప్రోగ్రాం అధికారి నాగేశ్వరరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్, ఉద్యాన శాఖాధికారి రఘునాథరెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం, ప్రాంతీయ పట్టుపరిశ్రమ సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ కేపీ కిరణ్‌కుమార్, కళ్యాణదుర్గం కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ సి.రాధకుమారి, డాట్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ రామసుబ్బయ్య, రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, కేవీకే రెడ్డిపల్లి శాస్త్రవేత్త డాక్టర్ కిశోర్‌రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి, జిల్లా సభ్యుడు ఆలమూరు సుబ్బారెడ్డి హాజరయ్యారు. కొత్త వంగడాలను పరిచయం చేయడంతో పాటు సాగు విధానాలు, తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఉత్పత్తి సాధించడం, అధిక లాభాలు పొందే విధానాలపై రైతుల్లో చైతన్యం తీసుకురావడం గర్వంగా ఉందని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. అనంతరం రైతులు అడిగిన పలు ప్రశ్నలకు వ్యవసాయ శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చారు. ఉత్తమ రైతులతో పాటు వివిధ అంశాల్లో ప్రతిభ కనబరచిన అధికారులను సన్మానించారు.

క్లుప్తంగా

ఆర్జేడీని కలిసిన 'అపుస్మా' నాయకులు



ఆర్జేడీ రాఘవరెడ్డిని సన్మానిస్తున్న 'అపుస్మా' నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రాథమిక విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ వై.రాఘవరెడ్డిని ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) నాయకులు గురువారం కలిశారు. ఆర్జేడీగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారి జిల్లా పర్యటనకు వచ్చిన రాఘవరెడ్డిని అనంతపురంలో కలిసి సన్మానించారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఆర్జేడీ దృష్టికి తీసుకెళ్లారు. ఆర్జేడీని కలిసిన వారిలో అపుస్మా జిల్లా అధ్యక్షుడు కుసుమ పుల్లారెడ్డి, ప్రధానకార్యదర్శి చంద్ర, ట్రెజరర్ ఇక్బాల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, రఘునాథ రావు, సూర్యనారాయణ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నారాయణరెడ్డి, శశిభూషణ్, అన్వర్, జలీల్, రామచంద్రారెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

సమాన అధికారాలు కల్పించాలి

ఎంఈఓలతో సమానంగా ఎంఈఓ–2లకు అధికారాలు కల్పించేలా చూడాలని విద్యాశాఖ ఆర్జేడీ రాఘవరెడ్డికి ఏపీ ఎంఈఓ–2 అసోసియేషన్ నాయకులు విన్నవించారు. గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఆర్జేడీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎంఈఓ–2 అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భవానీ శంకర్, ప్రధానకార్యదర్శి నారపరెడ్డి, గౌరవాధ్యక్షులు లింగా నాయక్, కోశాధికారి తిప్పేస్వామి, గురుప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఓబయ్యకు డాక్టరేట్ ప్రదానం



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని కామర్స్ విభాగంలో పరిశోధన చేసిన ఎం. ఓబయ్యకు డాక్టరేట్ ప్రదానం చేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్ బి. శోభారాణి పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆన్ కస్టమర్ సాటిస్ఫ్యాక్షన్ విత్ రాయల్ ఎన్‌ఫీల్డ్ అండ్ హోండా బైక్స్ ఇన్ ద సెలెక్టెడ్ డిస్ట్రిక్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు. ఈ సందర్భంగా పలువురు ఓబయ్యను అభినందించారు.

బాలస్వామికి మేయర్ సన్మానం



బాలస్వామిని సత్కరిస్తున్న మేయర్ వసీం

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్ర ప్రభుత్వ క్రిస్టియన్ విభాగం సలహాదారు బాలస్వామిని మేయర్ వసీం సత్కరించారు. గురువారం జిల్లాకు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ క్రిస్టియన్ విభాగం సలహాదారు బాలస్వామిని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మేయర్ వసీం కలిశారు. ఈ సందర్భంగా బాలస్వామిని శాలువా సత్కరించారు. బీసీ సెల్ రీజనల్ కో ఆర్డినేటర్ రమేష్ గౌడ్, కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, కమల్ భూషణ్, వైఎస్సార్ సీపీ నాయకులు రామచంద్ర ఉన్నారు.

వైభవంగా వార్షికోత్సవం

రాప్తాడు: స్థానిక బీసీ కాలనీలో నాగులకట్ట దగ్గర ఉన్న షిర్డీ సాయిబాబ ఆలయంలో ఎనిమిదో వార్షికోత్సవాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఆలయంలో షిర్డీసాయి బాబా విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు వేద పండితులు వాసుదేవ రావు చేతుల మీదుగా పూజలు చేశారు. బీసీ కాలనీవాసులు ఆలయం దగ్గర ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అన్నదానం చేశారు.

నేత్రపర్వంగా సుబ్రహ్మణ్యషష్టి

అనంతపురం కల్చరల్: చెరువుకట్టపై వెలసిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, శివకోటి, హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథ అన్నపూర్ణేశ్వరి ఆలయాల్లో గురువారం సుబ్రహ్మణ్య షష్టి వేడుకలను నేత్రపర్వంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అంతకు ముందు హోమాలు, అభిషేకాలు, అర్చనలు అనంతరం అన్నదాన వితరణ జరిగింది.

కనీవినీ ఎరుగని రీతిలో సిద్ధం సభ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

• ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: దేశంలోనే ఎక్కడా జరగని విధంగా, కనీవినీ ఎరుగని రీతిలో రాప్తాడులో సిద్ధం సభ జరగబోతోందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 18న రాప్తాడులో సిద్ధం సభ జరగబోతుందన్నారు. ఈ సభకు ప్రియతమ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేస్తున్నారన్నారు. సిద్ధం సభలో మ్యానిఫెస్టో గురించి తెలియజేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమానికి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

త్వరలోనే ఇంటింటికీ నీరు..

ప్రస్తుతం పైప్‌లైన్ పనులు దాదాపు పూర్తి కావచ్చాయని, పీఏబీఆర్ డ్యాం నుంచి ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు సంబంధించి రూ.117 కోట్లతో నీటి సమస్య పరిష్కారానికి పనులు చూపుతున్నామని ఎమ్మెల్యే అన్నారు. దశాబ్దాలపాటు పరిటాల కుటుంబం అధికారంలో ఉన్నా ఏ ఒక్క రోజూ ప్రజా సమస్యలపై పట్టించుకోలేదని, సునీతకు పదవులపై ఉన్న వ్యామోహం ప్రజలపై లేదన్నారు. త్వరలోనే ఆత్మకూరు మండలంలో గొరిదిండ్ల, తోపుదుర్తి గ్రామాలకు సంబంధించి సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నామని, వాటికి సంబంధించి భూమి పూజ త్వరలోనే చేస్తామన్నారు. రాప్తాడు నియోజకవర్గానికి అహుడా పరిధిలోకి తీసుకొచ్చి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందజేసి, జిల్లాలో ఎక్కడా లేని విధంగా రాప్తాడు నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. తోపుదుర్తి రిజర్వాయర్‌కు సంబంధించి, సభలో సీఎం జగనన్న దృష్టికి తీసుకెళ్లి రైతుల ఖాతాలకు నగదు జమ అయిన తరువాతే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, వైస్ ఎంపీపీ విజయ్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బాలపోతన్న, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, నాయకులు బంధూక మధు, వెంకట్రాముడు, వాసుదేవరెడ్డి, వన్నూరప్ప, బాలస్వామిరెడ్డి, ఫణిరెడ్డి, మల్లన్న, అతిక్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, జయరామిరెడ్డి, అంజినప్ప, ఎర్రిస్వామి, ఆరోగ్యంరెడ్డి, రామునాయక్, కేశవరెడ్డి, గోవింద్, రామాంజి, వెంకటేష్, బాషా, పోతన్న, గోపాల్ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న మేయర్ వసీం, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్

సిద్ధం సభ విజయవంతం చేద్దాం

అనంతపురం టవర్‌క్లాక్: రాప్తాడులో ఈ నెల 18న జరగనున్న ఎన్నికల శంఖారావం సిద్ధం సభను విజయవంతం చేద్దామని మేయర్ వసీం, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సిద్ధం పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సిద్ధం సభను కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కమల్‌భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డి, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నాయకులు జోగి రాజేంద్ర, లక్ష్మీనారాయణ, శోభ, హిదయాతుల్లా,, మణి హేమకిరణ్, చంద్రాయుడు, బెస్త వెంకటేష్, ఇషాద్, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: ఈనెల 18న మండల కేంద్రంలోని ఆటో నగర్ సమీపంలో జరిగే ఎన్నికల శంఖారావం 'సిద్ధం' సభను విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా గొర్రెల, మేకల సహకార సొసైటీ చైర్మన్ పసుపుల నరసింహ గౌడ్, సిద్ధం సభ మండల ఇన్‌చార్జ్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మరూరు సొసైటీ అధ్యక్షుడు మాచిరెడ్డి కొండా రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ తదితరులు పిలుపునిచ్చారు. గొల్లపల్లి, హంపాపురం, మరూరు, ఎం.చెర్లోపల్లి, ఎం.బండమీదపల్లి తదితర పంచాయతీ గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణ స్వామి, సర్పంచులు హన్మంత్ రెడ్డి, ప్రభావతి, లక్ష్మీదేవి, ఉమాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు మాచిరెడ్డి చెన్నా రెడ్డి, వెంకట నారాయణ, ఫక్కీరప్ప, రామచంద్రారెడ్డి, బుడగ నాగరాజు, మారక సుబ్బారెడ్డి, నరసింహ రెడ్డి పాల్గొన్నారు.



రాప్తాడు: పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పర్యావరణ హితమే మానవాళి అభిమతం



మొక్కలు నాటుతున్న జేఎన్‌టీయూఏ వీసీ ప్రొఫెసర్ జీవీఎస్ శ్రీనివాస రావు

అనంతపురం: పర్యావరణ హితమే మానవాళి అభిమతం కావాలని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జీవీఎస్ శ్రీనివాస రావు అన్నారు.గురువారం జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలోని హంపీ హాస్టల్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని జాగ్రత్తగా పర్యవేక్షణ చేయడానికి కృషి చేయాలని తెలిపారు. ప్రతి విద్యార్థీ ఒక మొక్కను నాటడమే కాకుండా, వాటి పర్యవేక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ. అరుణకాంతి, ప్రొఫెసర్ కే మాధవి, ప్రొఫెసర్ టి. బాల నరసయ్య, పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం.రామశేఖర్ రెడ్డి, డాక్టర్ కే.దిలీప్ కుమార్, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జోజిరెడ్డి, వీసీ పీఏస్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ కట్టడాలకు పటిష్టమైనది భారతి సిమెంట్



ప్రమాద బీమా బాండ్లను అందిస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్: అత్యుత్తమ కట్టడాలకు పటిష్ట మైనది సిమెంట్ భారతి సిమెంట్ అని భారతి సిమెంట్ కంపెనీ టెక్నికల్ ఇంజనీర్ మోతిలాల్ అన్నారు. గురువారం అనంతపురం నగరంలోని ఓస్కరప్ప ట్రేడర్స్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. ఈ సందర్భంగా భారతి సిమెంట్ కంపెనీ సేల్స్ మేనేజర్ మోతిలాల్ మాట్లాడుతూ అత్యుత్తమ కట్టడాలకు నాణ్యమైన సిమెంట్ భారతి సిమెంట్ అన్నారు. రోబోటిక్ టెక్నాలజీతో తయారయ్యిందన్నారు. అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ స్లాబులకు అనుకూలంగా ఉంటుందనీ, పర్యావరణానికి అనుకూలంగా ఉంటుందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి భారతి సిమెంట్ కంపెనీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ సుబ్బరాయుడు, డీలర్లు వాసుదేవ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సంగీత మహోత్సవం

అనంతపురం కల్చరల్: ఈనెల 17న పెద్ద ఎత్తున సంగీత మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పాతపాట ప్రేమికుల సమూహం ప్రతినిధులు ఓబుళదాసు, జి.వెంకటరామయ్య ఓ ప్రకటనలో తెలిపారు. 'మరుపురాని మహనీయుడు ఘంటసాల – అమరగానం' పేరుతో శనివారం సాయంత్రం 4.30 గంటల నుంచిరాత్రి వరకు స్థానిక హౌసింగు బోర్డులోని ఘంట సాల స్మారక మండపం వద్ద సాగే సంగీతోత్సవంలో అన్ని జిల్లాల నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాల ఆర్కెస్ట్రా కళాకారులు హాజరవుతారన్నారు.

యువతతోనే దేశ భవిష్యత్తు

• జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం ఎడ్యుకేషన్:యువతపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ పేర్కొన్నారు. గురువారం ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 'యువ సంవద్– ఇండియా 2047' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నగరూరు రసూల్ కన్వీనర్‌గా వ్యవహరించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎంకే దేవకీమణి అధ్యక్షత వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలన్నారు. ఎస్కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డి. మురళీధర్ రావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నిర్దేశించిన పంచ ప్రాణ లక్ష్యాలను వివరించారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ కే నిర్మలమ్మ నేటి సమాజంలో యువత సక్రమంగా నడుచుకోవాలన్నారు. డాక్టర్ నగరూరు రసూల్ పరిశుభ్రతపై యువత విస్తృత ప్రచారం చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు 'యువ సంవద్ ఇండియా 2047'పై వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

నేటి నుంచి నగరానికి యథాతథంగా నీటి సరఫరా

అనంతపురం కార్పొరేషన్: పీఏబీఆర్ డ్యామ్‌లో మోటార్‌ను మరమ్మతులు చేయించామని నగరపాలక సంస్థ ఎస్ఈ రామమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం పీఏబీఆర్ డ్యామ్‌లో మోటార్ ఏర్పాటు పనులను ఎస్ఈ పర్యవేక్షించారు. శుక్రవారం నుంచి యథాతథంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోనున్నట్లు ఎస్ఈ తెలిపారు. ఎస్ఈతో పాటు ఈఈ సూర్యనారాయణ, డీఈ సుభాష్ తదితర ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధం ఉరుసు

అనంతపురం కల్చరల్: నగరంలోని మాల్దార్ వీధిలో వెలసిన మహిమాన్విత మాసుమాబీ సయ్యదా సారాన్ బీబీ గంధం ఉరుసు గురువారంరాత్రి ఘనంగా జరిగింది. ఉరుసు ఉత్సవాల సందర్భంగా ఆదోనికి చెందిన సద్గురువులు హజ్రత్ సయ్యద్ లతీఫ్ అహమ్మద్ ఖాదరి స్వామి, బనగానిపల్లెకు చెందిన సద్గురువు డాక్టర్ హజరత్ సయ్యద్ హుస్సేన్ బాద్‌షా ఖాద్రీ స్వామి ముఖ్య అతిథులుగా విచ్చేసి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. అనంతరం అన్నదానం జరిగింది. కార్పొరేటర్ బాబా, ఉత్సవ నిర్వాహకులు మాబు, జావేద్, లతీఫ్, జిలాన్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం మాఘ మాస షష్ఠిని పురస్కరించుకొని కనుల పండువగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర, శ్రవల్లి, దేవసేన ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న డాక్టర్ గురుగు బాలాజీ

అనంతపురం ఎడ్యుకేషన్: ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువత మత్తు పదార్థాల జోలికి వెళ్తే జీవితాలు నాశనమవుతాయని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ గురుగు బాలాజీ హెచ్చరించారు. ఎస్‌జీహెచ్ మైండ్ కేర్, ప్రగతిపథం యూత్ అసోసియేషన్, జామాతే ఇస్లామి హింద్, ఎస్ఆర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'మాదకద్రవ్యాల వాడకంపై కలిగే దుష్పరిణామాలు' అనే అంశంపై స్థానిక ఆర్ట్స్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ గురుగు బాలాజీ మాట్లాడుతూ వివిధ రకాల మత్తు పదార్థాలు, వాటి దుష్ఫలితాలను విద్యార్థులకు వివరించారు. మత్తులో మునిగితే ఎన్నో శారీరక, మానసిక, ఆర్థిక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, ప్రగతిపథం యూత్ అసోసియేషన్, ఎస్ఆర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, జమాతే ఇస్లామి హింద్ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంత సుందరీకరణే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కల్చరల్: నగర అభివృద్ధి, సుందరీకరణే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. నగరంలోని హరిశ్చంద్రఘాట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గ్యాస్ ఆధారిత దహన వాటికను గురువారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఘాట్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిరువీధుల జగదీష్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే అనంత, నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, కొత్తూరు పాతూరు ఆర్యవైశ్య సంఘాల అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు, పిన్ని నాగరత్నం తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై మాట్లాడారు. 11 ఏళ్ల కిందట పాడుబడిన స్థలాన్ని శ్మశాన వాటికకు కేటాయించామని, ఆర్యవైశ్యులు శ్మశానాన్ని కూడా దేవస్థానంలా మార్చేశారని అన్నారు. వాతావరణ కాలుష్య నివారణకు గ్యాస్ ఆధారిత దహనం అవసరమని, త్వరలో మరో రెండు సిద్ధంగా ఉన్నాయన్నారు. వాటిన్నంటికీ కార్పొరేషన్ సంపూర్ణ సహకారాలు అందిస్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వం శ్రమిస్తోందన్నారు. అనంతలో ఇప్పటి వరకు రూ. వేల కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. రోడ్ల సుందరీకరణకు మరో రూ.1,800 కోట్లు వెచ్చించామన్నారు. అంతకు ముందు కాటికాపరికి, అర్చకుడికి ఎమ్మెల్యే చేతుల మీదుగా ధన సహాయం చేశారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, కార్పొరేటర్లు రహంతుల్లా, అనిల్‌కుమార్‌రెడ్డి, చింతకుంట మధు, ఇషాక్, రామాంజనేయులు, కమల్‌భూషణ్, స్టాండింగ్ కౌన్సిల్‌మెంబర్ లక్ష్మిరెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ సత్రసాల మంజునాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి చేతక్ బ్యాటరీ వాహనాలు



వాహనదారుడికి కీ అందిస్తున్న డీటీసీ వీర్రాజు

అనంతపురం సెంట్రల్: నగరంలో రిత్విక గ్రూప్ షోరూంలో చేతక్ బ్యాటరీ వాహనాలను మార్కెట్‌లోకి గురువారం విడుదల చేశారు. ఉప రవాణా కమిషనర్ వీర్రాజు, ఐసీఐసీఐ జోనల్ హెడ్ హరీష్ బాబు, రిత్విక గ్రూప్ ఎండీ ప్రపూర్ణరెడ్డి, సీఎండీ శ్రీధర్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. బజాజ్ కంపెనీకి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బ్యాటరీ వాహనాలను మార్కెట్లోకి విడుదల చేశారన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి



వీసీకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని వైఎస్సార్ ఎస్సీ,ఎస్టీ బీసీ మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాన్‌టీచింగ్ హాస్టల్, టైం,మినిమం స్కేల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కరాటే పెద్దన్న కోరారు. ఈ మేరకు ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ కే హుస్సేన్ రెడ్డికి గురువారం వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులతో పాటు దివ్యాంగుల పోస్టులు కలిపి ఒకే నోటిఫికేషన్ ద్వారా 73 పోస్టుల భర్తీకి ప్రకటన ఇచ్చారన్నారు. వేర్వేరు నోటిఫికేషన్లు ఇవ్వలేదనే కారణంతో కోర్టులో స్టే వచ్చిందని, తాజాగా బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో వేర్వేరు నోటిఫికేషన్లు ఇవ్వాలని కోరారు. టైం స్కేల్ ఉద్యోగి గోపాల్ మరణించిన తర్వాత, అతని భార్య కూడా మరణించిందని, ఈ పరిస్థితుల్లో వారి కుమారుడికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అలాగే టైం , మినిమం స్కేలు ఉద్యోగులు ఐదుగురు వేర్వేరు కారణాలతో మరణించారని, వారి కుటుంబాలను ఆదుకోవాలని విన్నవించారు. వర్సిటీలోని బోధనేతర ఉద్యోగులకు హౌసింగ్ లోన్ కింద రూ.10 లక్షలు ఇస్తున్నారని, ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ ఎస్సీ, ఎస్టీ, బీసీ , మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అడ్వైజర్ డాక్టర్ కే. ఆనంద్, ఈసీ మెంబర్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

అప్పులబాధతో ఆత్మహత్యాయత్నం

అనంతపురం సిటీ: అనంతపురం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి నార్పల మండలం గడ్డంనాగేపల్లికి చెందిన నాగన్న కుమారుడు మురళి గురువారం ఆత్మహత్యాయత్నం చేశాడు. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన మేరకు.. మురళీ కుటుంబ సభ్యులు, బంధువులకు ఫోన్ చేసి.. అప్పులబాధ భరించలేక రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. కుటుంబ సభ్యులు, బంధువులు వెంటనే మురళీ చెప్పిన ప్రదేశానికి చేరుకున్నారు. అప్పటికే రైలు ఢీకొని అతను తీవ్ర గాయాలతో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. వెంటనే 108 వాహనంలో అతన్ని ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నగర శివారులోని కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు.

ఏఐఎస్ఎఫ్ నగర సమితి నూతన కమిటీ ఏర్పాటు

అనంతపురం ఎడ్యుకేషన్: అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) అనంతపురం నగర సమితి నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా మంజునాథ్, ప్రధాన కార్యదర్శిగా ఉమామహేష్, ఉపాధ్యక్షుడిగా వంశీ, అశోక్, హరికృష్ణ, నగర సహాయ కార్యదర్శులుగా రారాజు, విశ్వనాథ్, ఆనంద్, హర్ష, 19 కార్యవర్గ సభ్యులు, 27 కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమణయ్య కుల్లాయిస్వామి తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

అనంతపురం: నగరంలోని బుడ్డప్పనగర్‌కు చెందిన తిరుపాల్ ప్రసన్నాయపల్లి రైల్వే గేట్ సమీపంలో కర్ణాటక మద్యం అమ్ముతూ పట్టుబడినట్లు టూటౌన్ సీఐ క్రాంతికుమార్ తెలిపారు. అతని నుంచి 14 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అరుదైన చికిత్స విజయవంతం

అనంతపురం మెడికల్: కిమ్స్–సవీరా ఆస్పత్రిలో జిల్లాకు చెందిన వృద్ధురాలికి ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ మూడే సందీప్ చేసిన అత్యాధునిక రోటాప్రో రోటాబ్లేషన్ అనే అరుదైన చికిత్స విజయవంతమైంది. వివరాలను ఆస్పత్రి నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. వృద్ధురాలి గుండె కరోనరీ ధమనుల్లో పేరుకుపోయిన కాల్షియాన్ని సరికొత్త చికిత్స ద్వారా నయం చేశారు.